క్లుప్తంగా

పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేత



గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో జిల్లా అటవీశాఖాధికారి పోతురాజు ఆదివారం మొక్కలు నాటించారు. ఈసందర్భంగా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రయోజనార్థం మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కోరిటపాటి సతీష్, అధ్యక్షుడు పావులూరి శ్రీనివాసరావు రూ.ఎనిమిది వేలు విలువ గల పుస్తకాలను అందజేశారు. అనంతరం నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయశాఖ డెప్యూటీ డైరెక్టర్ సీహెచ్ దీక్షితులు, గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు అండగా ఉందాం



లక్ష్మీపురం: కేరళ వయనాడ్ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ సాయం అందించేందుకు ముందుకు రావాలని డీసీసీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. స్థానిక గుంటూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్ఎస్‌యూఐ విభాగం నగరంలో విరాళాలను వసూలు చేయడం చాలా సంతోషదాయకంగా ఉందన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం మాట్లాడుతూ కేరళ వయనాడ్ బాధితుల సహాయం కోసం రూ.50,970 విరాళం సేకరించినట్లు చెప్పారు. ఈసందర్భంగా వసూలు చేసిన మొత్తాన్ని లింగంశెట్టి ఈశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు వినయ్, జానీ, సునీల్, మీరావలి, ఆసిఫ్, సుమంత్ కళ్యాణ్, ఆకాష్, సత్య పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై స్వరరాగ సుధ ఆధ్వర్యంలో ఆదివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయని గాయకులు కె.వి. సాయిబాబాశర్మ, కృష్ణకుమారి గాత్ర ధారణలో స్వామి, అమ్మవార్ల భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. కీబోర్డుపై రామకృష్ణశర్మ, తబలాపై షణ్ముఖ శర్మ వాయిద్యా సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

సీజ్ చేసిన వాహనాలకు జరిమానా



నగరంపాలెం: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు చేపట్టిన విషయం విదితమే. ఈ మేరకు సీజ్ చేసిన 198 వాహనాలకు ఆదివారం పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిమానా విధించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిబంధనలపై వాహన తనిఖీలు చేపట్టామని అన్నారు. పిల్లలకు వాహనాలు అప్పగిస్తే ప్ర మాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నా యని పేర్కొన్నారు. అదే విధంగా నంబర్ ప్లేట్‌లేకుండా నేరాలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు డ్రైవ్ చేస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెదపరిమిలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

తాడికొండ: తుళ్లూరు మండలం పెదపరిమిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభించినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. సెంటర్‌లో బెంచీపై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది పడిఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీయగా వివరాలేమీ లభించకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. మృతుడు వయస్సు 60–65 సంవత్సరాలు ఉంటుందని, గత రెండు రోజులుగా గ్రామంలో సంచరిస్తూ మద్యం తాగినట్లు స్థానికులు తెలిపారు ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగి బెంచీపై పడుకొని కదలకపోవడంతో స్థానికులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో స్పందించిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తుళ్లూరు ఠాణాలో సంప్రదించాలని సీఐ కోరారు.

దోచుకునోళ్లకు... దోచుకున్నంత

- నగరంలో భారీగా బైక్ చోరీలు
- క్షణాల్లో బైక్‌లను మాయం చేస్తున్న ఆగంతకులు
- పోలీసులు కేసు కట్టరూ.. కనీసం ఘటనా స్థలాన్ని పరిశీలించరు
- పోలీసుల తీరుతో విసిగిపోతున్న బాధితులు



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ సబ్ డివిజన్ పరిధిలో పాతగుంటూరు అల్లీనగర్‌లో నివాసం ఉండే సతీష్ అనే వ్యక్తి రాత్రి పూట తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి నిద్రించాడు. తిరిగి తెల్లవారి లేచి చూసే సరికి తన బైక్ కనపడలేదు. ఈ ఘటన జరిగిన సమీపంలో రెండు రోజుల చిన్నబ్బాయి అనే వ్యక్తి యాక్టీవా చోరీకి గురైంది. అంతకు కొంత కాలం ముందే.. చిన్నబ్బాయి ఇంటి ఎదురుగా ఉండే వ్యక్తి ఫ్యాషన్ వాహనం చోరీకి గురైంది. బ్రహ్మానందరెడ్డి స్టేడియం దగ్గర వాకింగ్ వచ్చిన ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని స్టేడియం లోపల పెట్టి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి కనిపించలేదు. నగరంపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో ఇంటి ముందు పెట్టిన ద్విచక్ర వాహనాన్ని మాయం చేశారు. పాతగుంటూరు పరిధిలో వారం రోజుల వ్యవధిలో ఒకే బజారులో మూడు ద్విచక్ర వాహనాలు, వాహనాల్లో పెట్రోల్ చోరీకి గురయ్యాయి. అయితే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకున్న నాథుడే లేడు.

స్టేషన్‌కు వెళ్తే..

ద్విచక్ర వాహనం పోయిందని బాధితుడు స్టేషన్‌కు వెళితే.. తాళాలు వేశారా..? చుట్టుపక్కల వెతికారా..? ఒక్క సారి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని బైక్ స్టాండ్‌ల్లో చూసి రండి అంటూ తిప్పుతున్నారు. ఎన్నిసార్లు చూసి వచ్చినా.. కనీసం కేసు కూడా కట్టని పరిస్థితులు ఏర్పడ్డాయి. కేవలం ఈస్ట్ సబ్ డివిజన్ మే నెలలో 7, జూన్‌లో 6, జూలైలో 15 కేసులు మాత్రమే కట్టారంటే.. బాధితులకు ఎటువంటి పరిస్థితి ఎదురవుతోందో అర్థం చేసుకోవచ్చు. రెండునుంచి మూడు వారాల తిప్పటం పరిపాటిగా మారింది. రూపా యి రూపాయి కూడబెట్టో.. నెల నెల ఈఎంఐలు కట్టుకుంటున్న పేద, మధ్య తరగతి వ్యక్తులు వా హనం పోయిందని ఫిర్యాదు చేస్తే.. కనీసం పట్టించుకోకుండా, కేసులు నమోదు చేయకుండా స్టేషన్‌ల చుట్టూ తిప్పుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి.

కేసు కడితేనే.. బీమా..

ద్విచక్ర వాహనానికి సంబంధించి ఎఫ్ఐఆర్ చేస్తేనే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని ఆయా ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. ఒక పక్క పోలీసులు పట్టించుకోక ఇబ్బంది పడుతున్న బాధితులు ఎఫ్ఐఆర్ కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఆఖరికి ప్రాధేయపడో.. లేక ఆ స్టేషన్ అధికారుల చేతులు తడిపో.. ఎఫ్ఐఆర్ కట్టించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసులు కేసు నమోదు చేయకపోవటంతో ఇన్సూరెన్స్ ఇబ్బందులు తలెత్తటంతో బాధితులు ఇబ్బందులు పడక తప్పటంలేదు.

ఘటనా స్థలాన్ని సందర్శిస్తే ఒట్టు..



ద్విచక్ర వాహనాల విషయంలో తాత్సారం చేస్తున్న పోలీసులు కనీసం వాహనం పోయిన ఘటన స్థలాన్ని కూడా పరిశీలిస్తున్న దాఖలాలు లేవు. ఏదైనా చోరీ జరిగితే కచ్చితంగా ఘటనా స్థలాన్ని పరిశీలించి అక్కడ స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు. సాంకేతిక నైపుణ్యంతో ఆ సమయంలో అర్ధరాత్రి వేళ సెల్‌ఫోన్ టవర్ పరిశీలించాల్సిన క్రైం సిబ్బంది కన్నెత్తి కూడా చూడడం లేదు.

ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్‌లకు రక్షణేది

గుంటూరు మెడికల్: కోల్‌కొతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఆదివారం గుంటూరులో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ పిలుపు మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షురాలు, గుంటూరుకు చెందిన సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ భారతావని ఈ ఘటనతో ఉలిక్కిపడిందన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని చేసుకుంటున్న వేళ ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్‌ల ప్రాణాలు కాపాడుకోలేని దుస్థితి మనకు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విపరీత మనస్తత్వంతో మానవ మృగాలుగా మారి అభం శుభం తెలియని పసివారిని వదలక వారి ప్రాణాలను ఛిద్రం చేస్తుంటే లోపం ఎక్కడుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. డాక్టర్ సారిక మాట్లాడుతూ గాంధీజీ చెప్పిన విధంగా నిజమైన స్వాతంత్ర్యం ఇప్పటివరకు రాలేదన్నారు. ఆడవారు అర్ధరాత్రి కాదు కదా పట్టపగలు బయటకు వెళ్లిన అమ్మాయి తిరిగి ఇంటికి క్షేమంగా వస్తుందనే నమ్మకాలు లేని దుస్థితి నేటి సమాజంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షలు విధించి మరెవరైనా సరే ఆడవారిపై ఇలాంటి ఘటనకు పాల్పడాలంటే భయాన్ని కలిగించేలా ఆ శిక్షలు ఉండాలని డిమాండ్ చేశారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ అబ్దుల్ గఫూర్ మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు దేశానికి సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఇలాంటి ఘటన జరగటం ప్రతి ఒక్కరి మనసులను కలిచి వేస్తుందన్నారు.

వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ గుంటూరు బైక్ బండిట్స్ రైడింగ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. లాడ్జి సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శించారు. పనిచేసే మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చట్టాలు కల్పించాలని కోరారు.



నిరసన తెలియజేస్తున్న సమితి నేతలు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది



బైక్ బండిట్స్ రైడింగ్ కమ్యూనిటీ సభ్యుల నిరసన

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజల నుంచి తాగునీటి సరఫరా, వీధి దీపాలు ఇతర సమస్యలపై సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీచౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

నగరంపాలెం: స్థానిక నల్లపాడురోడ్డు సాయినగర్‌లోని మహాగణపతి కుమారస్వామి సహిత చౌడేశ్వర చంద్రశేఖర సమన్విత చక్రాలయంలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి ప్రతిష్ట కృతువు, కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు శ్రీవశిష్ట హరేరామ జపయజ్ఞ ఆశ్రమ పీఠాధిపతి శ్రీప్రణవానందగిరి స్వామి హాజరయ్యారు. పూర్ణకుంభ పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సర్వాధికార ప్రతినిధి శ్రీవిశ్వంభరానందగిరిస్వామి, ఆలయ శాశ్వత ధర్మకర్త కొమ్మన నరసింహారావు పాల్గొన్నారు.

21న డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు

తెనాలి: డీఎస్సీ పరీక్ష రాయనున్న అభ్యర్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జనవిజ్ఞానవేదిక సంయుక్త నిర్వహణలో ఈనెల 21వ తేదీన తెనాలిలో ఉచిత అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. ఆయా సంస్థల నాయకులు ఎండీ గయాసుద్దీలా, టీఎస్ఎస్ఎల్ మల్లేశ్వరరావు, అహ్మద్ హుస్సేన్, కామాక్షి, కె.సాంబశివరావు, అమిరిశెట్టి శ్రీధర్, అంగిరకుల ఉమామహేశ్వరరావు, కుర్రా శ్రీనివాసరావు తదితరులు వివరాలను తెలియజేశారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీఓ కల్యాణమండపంలో సాయంత్రం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు జరగనున్న సదస్సులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డీఎస్సీ పరీక్షపై అవగాహన కల్పిస్తారన్నారు.

గుండెజబ్బులపై అవగాహన అవసరం

లక్ష్మీపురం: క్రమపద్ధతిలో జీవనం ద్వారా గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కే హేమసుందర్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పూర్వకాలంలో ఈ గుండెకు సంబంధించిన సమస్యలు పెద్దవారిలో ఎక్కువగా చూసేవారం, కానీ ఇటీవల శ్రమలేని పని విధానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడిలో ఇతర అనారోగ్య సమస్యలు మూలంగా చిన్న వయసు వారిలో కూడా గుండెకు సంబంధించిన సమస్యలను చూస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు చాతిలో నొప్పిగా అనిపించినప్పుడు అది గ్యాస్ నొప్పి అని అపోహ చెందక వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం అవగాహన సభ్యులు అడిగిన గుండెకు సంబంధించిన వ్యాధులకు తగు వైద్య సలహాలు, సూచనలను ఇచ్చారు. అవగాహన సభ్యులు డాక్టర్ కే హేమ సుందర్ ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్ర రావు, ఫణి కుమార్, వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.హేమ సుందర్

ఆర్‌యూబీలను వదలని మురుగు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు

లక్ష్మీపురం: అధికారుల నిర్లక్ష్యంతో నగర ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కొద్దిపాటి వర్షానికి ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రైల్వే అధికారులు కంకరగుంటలో ఆర్‌యూబీ ఏర్పాటు ఏర్పాటు చేశారు. నిర్మించిన ఎంతో కాలం గడుస్తున్నా.. వర్షం పడితే పూర్తిగా మురుగునీటితో నిండిపోవాల్సిన దుస్థితి కనిపిస్తోంది. వాహనదారులు, పాదచారులు మురుగు నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తుంది. ముందు ఇరువైపుల దారి ప్రధాన మార్గంలో వర్షం నీరు, మురుగు నీరు ప్రవహించేందుకు ఓ చిన్నపాటి కాలువను దానిపై ఇనుప కంచె ఏర్పాటు చేశారు. అయితే ఆ ఇనుప కంచె మూతపై అలాగే ఆర్‌యూబీ మధ్యలో ఉన్న రంధ్రాలు మట్టితో నిండి పోవడంతో మురుగు నీరు కాలువలో నుంచి ప్రవహించకుండా ఆర్‌యూబీలోకి చేరుతోంది. ఇదిలా ఉంటే కొద్దిపాటి వర్షం కురిసిందంటే చాలు ఈ ఆర్‌యూబీ నిండి పోయి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అయితే ప్రస్తుతం ఈ దారి మార్గ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఉన్న కాలువలో మురుగు అంతా కూడా నిల్వ చేరి ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఈ కాలువలో మురుగు నీరంతా కూడా దుస్తులపై పడుతుందని వాపోతున్నారు.

మందుబాబులకు అడ్డగా...

ఆర్‌యూబీ లోపలి భాగంలో విద్యుత్ దీపాలు సక్రమంగా పని చేయడం లేదు. దీంతో కొందరు గుర్తు తెలియని యువకులు మద్యం తాగి విద్యార్థినులను, మహిళలను వేధిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షపు నీరు నిండి పోయి రాకపోకలు అంతరాయం కలిగిన సమయంలో రైలు పట్టాలపై నుంచి పాదచారులు వెళుతుంటారు. అయితే రైలు పట్టాలపై ఫ్లైఓవర్ కింద మందు బాబులు మద్యం తాగి అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ఇబ్బందులు గురి చేస్తుంటారని చెబుతున్నారు.





కంకరగుంట ఆర్‌యూబీలోకి ప్రవేశించే ఇరు వైపుల దారి ప్రధాన మార్గంలో పేరుకు పోయిన మురుగునీరు(ఫైల్)

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట

నగరంపాలెం: భూత, భవిష్యత్, వర్తమానాలను కాలజ్ఞాన రూపంగా ప్రపంచానికి అందించిన కాలజ్ఞాని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. అరండల్‌పేట చంద్రయ్యనగర్ 11/3వ అడ్డరోడ్డులో గణపతి, గోవిందమాంబ సమేత విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, మాత ఈశ్వరి దేవి, సిద్ధయ్య విగ్రహాల పునఃప్రతిష్ట, నూతన ధ్వజస్తంభ స్థాపన మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ట ప్రధాన ఆచార్యులు ఆలూరి సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో అశేష భక్తుల భక్తి ప్రపత్తులతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామిని కుల మతాలకు అతీతంగా ఆరాధిస్తారని పేర్కొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కడియాల సుబ్బారావు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి కలియుగ ప్రత్యక్ష దైవమని అన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి, 52వ డివిజన్ కార్పొరేటర్ మల్లెబోయిన శ్రీవల్లి, కడియాల సూర్యకుమారి, బజరంగ్‌దళ్ రామకృష్ణ, గట్టి శ్రీనివాసరావు, సిద్ది సాంబశివరావు, కె గోవర్ధనచారి, ఎం.శివరామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు. అనంతరం పెద్ద ఎత్తున్న అన్నదానం నిర్వహించారు.



ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి

విద్యార్థి దశలోనే చేతిరాతను మెరుగుపరచుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా చదువుపై ఏకాగ్రతతో పాటు చేతిరాతను అందంగా మార్చుకోవచ్చునని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు అన్నారు. క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఆదివారం స్థంభాల గరువులోని చేబ్రోలు పుల్లయ్య- మహాలక్ష్మి నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో 25 మంది ఉపాధ్యాయులతో పాటు 30 మంది విద్యార్థులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రామమోహనరావు మాట్లాడుతూ క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 42,500 మంది విద్యార్థులతో పాటు 3,675 మంది ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చలమయ్య హైస్కూల్ హెచ్ఎం రమాదేవి, క్యాలిగ్రఫీ ఫ్యామిలీ సభ్యులు ప్రసాద్, షాజీర్, బురాన్, సత్యనారాయణ, రమేష్, చెన్నకేశవరావు, నాగలక్ష్మి, రమాదేవి, చెరుకుపల్లి రమాదేవి, శైలజారాణి పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో ఉప్పాల రామమోహనరావు, క్యాలిగ్రఫీ ఫ్యామిలీ సభ్యులు

అభిమానులను సేవకులుగా మార్చిన ఘనత చిరంజీవిదే

తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు ఎడ్యుకేషన్: అభిమానులను సమాజ సేవకులుగా మార్చిన ఘనత చిరంజీవిదే అని తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ అన్నారు. సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఆదివారం గోరంట్లలోని షిప్ సేవా సంస్థకు చెందిన 60 మంది విద్యార్థులకు పౌష్టికాహారం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, చిరంజీవి ముందస్తు జన్మదిన కేక్ కట్ చేశారు. చిరంజీవి వ్యక్తిత్వం ఎవరెస్టు శిఖరం వంటిదని, మానవతా విలువలతో లక్షలాది మంది అభిమానులను సమాజ సేవకులుగా మార్చడం ఒక చరిత్ర అని కొనియాడారు. షిప్ సంస్థ అధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ అఖిల భారత చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా తమ సంస్థలోని విద్యార్థుల సంక్షేమానికి చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జి.సాయికృష్ణ శ్రీనివాస్, జాస్తి వీరాంజనేయులు, చెరుకూరి శ్రీహరి, వీఆర్ మాస్టారు, మేకల పురుషోత్తం, చిమటా శ్రీనివాస్, గిడుతూరి సత్యం, శంకర్ రెడ్డి, పీఎస్ఆర్ డిజిటల్స్ శివ, నాగరాజు, యుగంధర్, పులిగడ్డ నాగేశ్వరరావు, శ్రీకాంత్, ఆదిత్య, మహంకాళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిరంజీవి జన్మదిన కేక్ కోస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మేకల రవీంద్రబాబు, రమాదేవి

ఆర్యవైశ్యులు దాన గుణానికి మారుపేరు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్యులు దాన గుణానికి మారుపేరు అని శివ ఇంజినీరింగ్ అధినేత మట్టుపల్లి శ్రీనివాస్ శరణ్ పేర్కొన్నారు. అరండల్ పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో అవోపా గుంటూరుశాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ శరణ్ మాట్లాడుతూ అవోపా ద్వారా విద్య, వైద్యం అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మెడిసిన్ చదివే పేద విద్యార్థికి ఐదేళ్లపాటు ఫీజులు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ పొట్టి గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి నెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈసందర్భంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఆయన రూ.54 వేలు విరాళాన్ని అదజేశారు. కార్యక్రమంలో అవోపా ప్రతినిధి ఊటుకూరి నాగేశ్వరరావు, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, వెంకట్రావు పాల్గొన్నారు.



పేదలకు పెన్షన్ పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ శరణ్, గోవర్ధన్ తదితరులు

పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు పాడిరైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక అయితానగర్‌లోని ఎర్రబడి సెంటర్‌లో ఆదివారం మేకల అనసూయ అధ్యక్షతన పాడిరైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి, పంట రైతుకు రెండు కళ్లలాంటివని చెప్పారు. పంట దెబ్బతింటే పాడి మీద అయినా కుటుంబాన్ని పోషించుకోవచ్చనే ఆశతో ఉన్న పాడిరైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పశువుల ధరలు, వరిగడ్డి, పచ్చిగడ్డి, తవుడు, దాణా ధరలతోపాటు పశువుల మందుల ధరలు కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయని చెప్పారు. మహిళా పాడిరైతులు గ్రూపులుగా ఏర్పడి ఐక్యంగా ఉండాలని సూచించారు. వేజెండ్ల తబిత మాట్లాడుతూ గత 15–20 ఏళ్లగా కౌలు వ్యవసాయం తోపాటు పశుపోషణ చేస్తున్న తమకు తగిన ఆర్థికసాయం చేయాలని కోరారు. మాన్యం శ్యాంబాబు మాట్లాడుతూ గోకులం, మినీగోకులం కింద షెడ్లు, దోమతెరలు వగైరాల కోసం సబ్సిడీ, సబ్సిడీయేతర సాయం ఇవ్వాలని కోరారు. కార్యాచరణ కోసం అయిదుగురితో కమిటీ ఏర్పాటుచేశారు. సీహెచ్ మార్తమ్మ, జి.అరుణ, మేకల ప్రకాష్, అత్తోట సరోజిని, జి.సునీత, తెనాలి ఝాన్సీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి